సాక్షి
నల్లగొండ
శనివారం । 2 । మార్చి । 2024



'ఆడిట్'లో అగ్నిప్రమాదం

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆడిట్ కార్యాలయంలో గురువారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. - 8లో



యాదాద్రి అభివృద్ధికి కృషి

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. - 8లో



మూడు, నాలుగు ఉద్యోగాలు

ఇటీవల వెలువడిన గురుకుల ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు మూడు, నాలుగు ఉద్యోగాలు సాధించారు. - 8లో

న్యూస్‌రీల్

డీసీసీబీ సీఈఓ బాధ్యతల స్వీకరణ



రావులపాటి శంకర్‌రావు

నల్లగొండ టూటౌన్ : జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ నూతన సీఈఓగా రావులపాటి శంకర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ పాలకవర్గం, బ్యాంకు ఉద్యోగుల సహకారంతో బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలోని డీసీసీబీ బ్రాంచ్‌ల ద్వారా రైతులకు సత్వర సేవలందేలా చర్యలు చేపడుతామన్నారు. అనంతరం బ్యాంకు ఉద్యోగులు శంకర్‌రావుకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

నల్లగొండ : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో మొత్తం 14,496 మంది విద్యార్థులకు గాను 13,902 మంది పరీక్ష రాయగా, 594 మంది గైర్హాజర్ అయ్యారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదని డీఐఈఓ దస్రూనాయక్ తెలిపారు. విద్యార్థులు హెల్ప్‌లైన్ నంబర్ 14416, టోల్ ఫ్రీ నంబర్ 1800-891-4416 ఫోన్ చేసి మానసిక వైద్య నిపుణుల ద్వారా తగు సూచనలు పొంది ఆందోళన చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ

కనగల్ : మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) పాల్వాయి శ్రవణ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణం యజమానులు తమ వద్ద ఉన్న ఎరువులను ఈ పాస్ మెషిన్ ద్వారానే అమ్మాలని సూచించారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయాల్లో నిబంధనలు పాటించి, రైతులకు నాణ్యమైన ఎరువులు అందించాలన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పకుండా రశీదులు తీసుకోవాలని సూచించారు. వ్యాపారులు తమ లైసెన్స్‌లను పునరుద్ధరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ బెజవాడ అమరేందర్‌గౌడ్, ఏఈఓ తదితరులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

రామగిరి(నల్లగొండ) : జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టుల్లో ఈ నెల 16న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు పర్యవేక్షణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సంస్థ సెక్రటరీ బి.దీప్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటారు వాహనాల ప్రమాద బీమా, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్, భూ వివాదాల కేసులు పరిష్కరించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. ఇప్పటి వరకు 3,601 కేసులు రాజీ పడదగినవిగా గుర్తించినట్లు వెల్లడించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సత్వర న్యాయాన్ని పొందాలని సూచించారు.

విద్యార్థులు మనోధైర్యం కోల్పోవద్దు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్‌సీఓ లక్ష్మయ్య

దేవరకొండ : విద్యార్థులు ఎలాంటి పరిస్థితుల్లోనూ మనోధైర్యం కోల్పోవద్దని గిరిజన గురుకులాల ఆర్‌సీఓ లక్ష్మయ్య పేర్కొన్నారు. శుక్రవారం దేవరకొండలోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో సైకాలజీపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే దేనినైనా ఎదుర్కొనే విధంగా మానసికంగా సిద్ధంగా ఉండాలన్నారు. విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యువ కేంద్రం అధికారి ప్రవీణ్‌సింగ్, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, కొర్ర రాంసింగ్, తదితరులు ఉన్నారు.

• ఆర్య సమాజ్‌లో మహాయజ్ఞం



నల్లగొండలోని ఆర్య సమాజ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం 200 కుండలాలతో మహాయజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ!

ఆస్తిపన్ను బకాయిలపై ఆఫర్

- 90 శాతం వడ్డీ మాఫీ చేస్తూ ఉత్తర్వులు
- చెల్లింపులకు ఈనెలాఖరు వరకు అవకాశమిచ్చిన ప్రభుత్వం
- బకాయిదారులకు ఊరట



నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను బకాయిలు ఉన్న వారికి ప్రభుత్వం తీపికబురు అందించింది. జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ, హాలియా, నందికొండ, దేవరకొండ, చండూరు, చిట్యాల, నకిరేకల్ మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను బకాయిలు పడిన వారికి వడ్డీలో 90 శాతం మాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని 8 మున్సిపాలిటీల్లో వేలాది మంది ఆస్తి పన్ను సకాలంలో చెల్లించకపోవడంతో బకాయిలపై వడ్డీ భారీగా పెరిగిపోతోంది. పదేళ్ల పాటు ఆస్తి పన్ను చెల్లింపులు జరుగకపోతే ఆస్తి పన్ను వడ్డీ కలుపుకొని రెండింతలు అవుతుంది. ఈ విషయాన్ని పట్టించుకోని భవన యజమానులు ఆస్తిపన్ను చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. అసలు, వడ్డీ చెల్లింపులు భవన యజమానులకు భారంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వడ్డీపై 90 శాతం మాఫీ చేస్తూ నిర్ణయం తీసుకుంది.

మొత్తం ఒకేసారి చెల్లిస్తేనే..

పట్టణాల్లోని ఆస్తిపన్ను బకాయిలకు వడ్డీపై 90 శాతం మాఫీ వర్తించాలంటే బకాయిలతో సహ మొత్తం ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. 2023 మార్చి నెలాఖరు వరకు ఉన్న బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ చేయనున్నారు. రెండు, మూడు సార్లు చెల్లిస్తే 90 శాతం వడ్డీ మాఫీ వరించదు. ఈ నెలాఖరులోగా ఆస్తిపన్ను మొత్తం చెల్లిస్తేనే మాఫీ వర్తించనుంది.

లక్షకుపైగా భవనాలు..

జిల్లాలోని 8 మున్సిపల్ పట్టణాల్లో లక్షకు పైగా భవనాలు ఉన్నాయి. ముఖ్యంగా నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాల్లోనే 70 వేల భవనాలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మిగతా 6 మున్సిపాలిటీలు చిన్నవి కావడంతో మరో 30 వేలకు ఉన్నట్లు తెలుస్తోంది. ఆస్తిపన్ను బకాయిలు కూడా నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ పట్టణాల్లో ఎక్కువగా ఉన్నాయి. ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీ 90 శాతం మాఫీకి ఉత్తర్వులు జారీ కావడంతో బకాయిల వసూలుకు మున్సిపల్ అధికారులు సిద్ధమవుతున్నారు.

పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి



ప్రభుత్వం ఆస్తిపన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీ చేసినందున బకాయి పడ్డ వారంతా సద్వినియోగం చేసుకోవాలి. ఈ నెలలోనే భవన యజమానులంతా ఆస్తిపన్ను మొత్తం చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి. ఆస్తి పన్ను బకాయిలను వంద శాతం వసూలు చేసేందుకు ఇప్పటికే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ

సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హరిచందన పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లతో ఆమె సమావేశమై మాట్లాడారు. మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీ మాఫీ ప్రకటించిన విషయాన్ని ఆటోల ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. మార్చి 31లోగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి ఈ మాఫీ వర్తిస్తుందన్న విషయాన్ని తెలియజేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

గృహజ్యోతి జీరో బిల్లు జారీ

- 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులు తీసిన సిబ్బంది



నల్లగొండలో జీరో బిల్లు తీసి వినియోగదారులకు అందిస్తున్న డీఈ వెంకటేశ్వర్లు

నల్లగొండ : ఎన్నికల హామీల్లో భాగంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం జీరో బిల్లులు జారీ చేస్తోంది. ఫిబ్రవరి 27న ఈ పథకాన్ని హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా శుక్రవారం విద్యుత్ వినియోగదారులు ఫిబ్రవరిలో వాడుకున్న 200 యూనిట్లలోపు విద్యుత్‌కు జీరో బిల్లులు జారీ చేశారు. ఈ పథకానికి ఇప్పటికే 1,87,628 మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. వారందరికీ ఈ నెలలో జీరో బిల్లులు జారీ చేయనున్నారు. గృహజ్యోతి పథకం కింద ప్రజాపాలనలో ఆధార్, రేషన్ కార్డుతో దరఖాస్తు చేసుకున్న వారిని అర్హులుగా గుర్తించారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అన్నీ పరిశీలించి వారు విద్యుత్ శాఖకు పంపనున్నారు.

బిల్లు జారీ విధానం పరిశీలన..

శుక్రవారం నల్లగొండలోని రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లో నల్లగొండ విద్యుత్ శాఖ ఆపరేషన్ డీఈ వెంకటేశ్వర్లు జీరో బిల్లు జారీ చేసే తీరును పరిశీలించారు. పలుచోట్ల ఆయనే స్వయంగా బిల్లులు తీసి వినియోగదారులకు అందించారు. ఆయన వెంట ఏడీఈ శంకరయ్య తదితరులు ఉన్నారు.

తాగునీటికి ఇబ్బంది కలగొద్దు

- మొక్కలు ఎండిపోకుండా చూడాలి
- ఎక్కువ మంది కూలీలకు ఉపాధి పని కల్పించాలి
- జూమ్ మీటింగ్‌లో కలెక్టర్ హరిచందన



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ : వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిచందన ఆదేశించారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్ నుంచి వివిధ అంశాలపై గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ట్రాక్టర్లను పూర్తిగా ప్రత్యేక అధికారులు వారి నియంత్రణలో ఉంచుకోవాలని, ప్రతి గ్రామానికి తాగునీటి వనరులను గుర్తించాలని, పూర్తిగా క్లోరినేషన్ చేసిన తర్వాత మాత్రమే తాగునీటిని ప్రజలకు అందించాలని, ఎక్కడైనా పంపులు మరమ్మతుకు వచ్చినట్లయితే మరమ్మతులు చేయించాలని సూచించారు. నీరు వచ్చేందుకు అవకాశం ఉన్న బోర్లను మాత్రమే ఫ్లషింగ్ చేయాలని, కొత్త బోర్లు వేయవద్దని ఆదేశించారు. వేసవి కారణంగా మొక్కలు ఎండిపోకుండా క్రమంతప్పకుండా నీరు పెట్టాలన్నారు. ప్రతి నర్సరీలో మొక్కలకు నీడ వేయించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద పనులను గుర్తించడమే కాకుండా, ఎక్కువ మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చూడాలని పేర్కొన్నారు. పారంపాండ్‌లు, చెరువుల పనులు గుర్తిస్తే రాబోయే వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే అవకాశం ఉంటుందన్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాలకు వెళ్లి శానిటేషన్, తాగునీరు, మొక్కలకు నిరంతరం నీరు అందించడం, వీధిలైట్లు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతిరోజు పారిశుద్ధ్య కార్యక్రమాల ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, ప్రజాపాలనకు సంబంధించి అన్ని ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆస్తిపన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని, మార్చి చివరినాటికి నూరు శాతం పన్ను వసూలు చేయాలని పేర్కొన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని వీలైనంత ఎక్కువమంది ఉపయోగించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీఓ మురళి, జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వరరావు, నల్లగొండ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మూడోసారీ మోదీ ప్రభుత్వమే..



సభలో అభివాదం చేస్తున్న ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం బ్రజేష్ పాఠక్, నాయకులు

- విజయసంకల్ప యాత్ర ముగింపు సభలో యూపీ డిప్యూటీ సీఎం బ్రజేష్ పాఠక్

నల్లగొండ టూటౌన్ : ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు దేశాన్ని అభివృద్ధి చేసిన మోదీ ప్రభుత్వమే మూడోసారి కూడా కేంద్రంలో అధికారంలోకి రాబోతుందని ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం బ్రజేష్ పాఠక్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ విజయసంకల్ప యాత్ర శుక్రవారం నల్లగొండకు చేరుకుంది. పానగల్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి పెద్ద గడియారం సెంటర్‌లో ముగింపు సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం బ్రజేష్ పాఠక్ మాట్లాడుతూ పేదలకు ఉజ్వల పథకం కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందించామని, రైతులకు కిసాన్ సమ్మాన్ కింద ఏడాదికి రూ.6 వేలు అందిస్తున్న ఘనత మోదీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. దేశ ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని.. బడుగు, బలహీనవర్గాలకు అనేక సంక్షేమ పథకాలు ఇచ్చిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా మోదీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కాసం వెంకటేశ్వర్లు, దుగ్యాల ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ నల్లగొండ పార్లమెంట్ నుంచే బీజేపీ విజయఢంకా మోగించాలన్నారు. గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో మోదీ ఉండాలని ప్రజలంతా కోరుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో రెండు, మూడు కుటుంబాల వారు తాము ఏది చెబితే అదే అనుకుంటున్నారని, అలాంటి వారికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. దమ్ముంటే రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి.. కేసీఆర్‌పై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు నాయకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, నూకల నరసింహారెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, బండారు ప్రసాద్, గార్లపాటి జితేంద్రకుమార్, జుట్టుకొండ సత్యనారాయణ, పోతెపాక సాంబయ్య, దాయం భూపాల్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, పెరిక మునికుమార్, కంకణాల నాగిరెడ్డి, శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

రేపు పల్స్ పోలియో కార్యక్రమం

- ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్న వైద్యసిబ్బంది
- 1,61,925 మంది పిల్లల గుర్తింపు
- జిల్లా వ్యాప్తంగా 981 కేంద్రాలు



నల్లగొండ టౌన్ : చిన్నారులు పోలియో మహమ్మారి బారినపడకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఈనెల 3న (ఆదివారం) పల్స్ పోలియో కార్యక్రమానికి సిద్ధమైంది. ఇందుకోసం ఇప్పటికే 0-5 సంవత్సరాలలోపు చిన్నారులు 1,61,925 మంది ఉన్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. వారందరికీ పోలియో చుక్కలు వేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేసింది. మొత్తం 34 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్, 5 అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో మొత్తం 981 పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. రూరల్ ఏరియాలో 836, అర్బన్‌లో 145, మొబైల్ టీంలు 39, ట్రాన్సిస్ట్ పాయింట్లు 39 ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ హెల్త్ స్టాఫ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లకు శిక్షణ పూర్తి చేసింది. వ్యాక్సిన్‌ను కూడా జిల్లా కేంద్రానికి తెప్పించి సిద్ధంగా ఉంచింది.

4,280 మంది సిబ్బంది

పోలియో చుక్కలను వేయడానికి అవసరమైన 4,280 మంది సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నియమించింది. అందులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది 579, అంగన్‌వాడీ సిబ్బంది 2,093 , ఆశాలు 1,469 మంది, ఇతర వలంటీర్లు 139 మందిని నియమించింది. ఉదయం 7గంటల నుంచి రాత్రి 7గంటల వరకు పోలియో చుక్కలు వేయనున్నారు.

రెండు రోజులు ఇంటింటికి తిరిగి..

పోలింగ్ కేంద్రాల్లో పోలియో చుక్కలను వేయించుకోని వారిని గుర్తించి 4, 5 తేదీల్లో ఇంటింటికి తిరిగి చిన్నారులకు పోలియో చుక్కలను వేయనున్నారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లు, ఇటుక బట్టీలు, ఇతర సంచార జాతులు నివాసం ఉండే ప్రాంతాను గుర్తించారు. ఇందుకు అవసరమైన మొబైల్ బృందాలను ఏర్పాటు చేశారు.

పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

జిల్లాలో నిర్వహించే పల్స్‌పోలియోను పర్యవేక్షించడానికి కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా అదనపు కలెక్టర్‌లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ఇతర ప్రాజెక్టు అధికారులు, డివిజన్ స్థాయిలో ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులు పర్యవేక్షించనున్నారు. అదే విధంగా బూత్‌లను పర్యవేక్షించడానికి 107 మంది సూపర్‌వైజర్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నియమించింది.

పోలియో చుక్కలు వేయించాలి



జిల్లాలో నిర్వహించే పోలియో చుక్కల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. 0-5 సంవత్సరాలలోపు చిన్నారులందరినీ తల్లిదండ్రులు కేంద్రాలను తీసుకుపోయి విధిగా చుక్కలు వేయించాలి.

– డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టిపెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

- జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు, కార్మికులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికార, ప్రతిపక్ష పార్టీలు వాటిపై దృష్టి పెట్టకుండా ప్రాజెక్టుల చుటూ తిరుగుతున్నారని మండిపడ్డారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు లేకపోయినప్పటికీ కుడి కాల్వ ద్వారా నీటిని విడుదల చేయడం సరైందికాదన్నారు. ఎండిపోయిన పంట పొలాలకు ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రాగిరెడ్డి మంగారెడ్డి, పాండు, రామ్మూర్తి, సత్యనారాయణరావు, వినోద్‌నాయక్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం కొనుగోలు చేయొద్దు

చిట్యాల : పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తే కఠినచర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి వి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం చిట్యాలలోని 1, 3, 4 రేషన్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేషన్ దుకాణాల్లో పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తే గుర్తింపును రద్దు చేయడం చేస్తామన్నారు. ఈనెల 31వ తేదీలోగా డీలర్లు తమ ఆథరైజేషన్‌ను రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు.



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్‌ఓ

పీఆర్‌సీ విడుదల చేయాలని ధర్నా



డిపో ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

మిర్యాలగూడ టౌన్ : 2017, 2021 రెండు పీఆర్‌సీ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ బస్ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ నల్లగొండ రీజినల్ చైర్మన్ కడియం రమేష్ మాట్లాడుతూ అపాయింటెడ్‌డే, పే స్కేల్ విషయంపై తాము శాంతియుతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాండ్ బకాయిల నిమిత్తం రూ.280 కోట్లు మంజూరు చేశారని, అవి నేటికీ ఉద్యోగులకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలోని ప్రతి రీజియన్‌లో ఉద్యోగులు శాంతియుతం వాతావరణంలో నిరసన కార్యక్రమాల ద్వారా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీసీ చలసాని నాగేశ్వర్‌రావు, టీఐ-3 బ్రిటిష్‌రెడ్డి, సేఫ్టీ వార్డెన్ టీఎస్‌రెడ్డి, డ్రైవర్లు, కండక్టర్లు కేవై రెడ్డి, జనార్దన్, శ్రీధర్‌రెడ్డి, తిప్పర్తిరెడ్డి, కేఎస్ రావు, చిల్లేపల్లి రెడ్డి, పారిజాత, సైదమ్మ, స్రవంతి, కనకయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4న జరగాల్సిన పరీక్షలు 11వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థి సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పరీక్షల టైమ్ టేబుల్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పెట్టినట్లు పేర్కొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



విద్యార్థులకు కరాటే బెల్టులు అందజేస్తున్న సుమన్

మిర్యాలగూడ: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని సినీ నటుడు సుమన్ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో సుమన్ అకాడమీ కరాటే చాంపియన్ షిప్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, గురుకుల పాఠశాలల విద్యార్థులకు కరాటే బెల్టులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను కరాటే అకాడమీ స్థాపించి 50 సంవత్సరాలు అవుతుందని, దేశ వ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులు, మహిళలు కరాటే నేర్చుకున్నట్లు తెలిపారు. ప్రతి ప్రాంతంలో కరాటే అకాడమీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు, మహిళలకు ఉచిత కరాటే శిక్షణ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు సైదులు, రామకృష్ణనాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటికి చేరుకున్న అదృశ్యమైన విద్యార్థిని

మిర్యాలగూడ: దామరచర్ల మండల కేంద్రంలో శుక్రవారం అదృశ్యమైన గురుకుల విద్యార్థిని క్షేమంగా ఇంటికి చేరింది. మండల కేంద్రంలో గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఉదయం 7.30గంటల సమయంలో నీళ్ల ట్యాంకర్ పాఠశాలకు రావడంతో.. అదే సమయంలో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. విద్యార్థిని కనిపించకపోవడంతో పాఠశాల సిబ్బంది పోలీసులు, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విద్యార్థిని ఆచూకీ కోసం తల్లిదండ్రులు, పోలీసులు వెతికే పనిలో ఉండగా.. సదరు విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాను సికింద్రాబాద్‌లో ఉన్నట్లు సమాచారం అందించింది. వెంటనే వారు అక్కడికి చేరుకుని క్షేమంగా ఇంటికి తీసుకొచ్చారు.

200 కుండలాలతో మహాయజ్ఞం



మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు



హోమం నిర్వహిస్తున్న ఆర్య సమాజ్ ప్రతినిధులు

- ఆర్యసమాజ్‌లో శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్య సమాజ్‌లో శతాబ్ది ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 200 కుండలాలతో మహాయజ్ఞం నిర్వహించారు. ఈ మహాయజ్ఞం మూడు రోజుల పాటు కొనసాగనుంది. ప్రధాన యజ్ఞకుండలిని పాతబస్తీ షేర్ బంగ్లా నుంచి ఆర్య సమాజ్ వరకు ర్యాలీగా తీసుకువచ్చారు. స్వామి ప్రణవానంద సరస్వతీ పర్యవేక్షణలో మహాయజ్ఞం జరిపించారు. కార్యక్రమంలో స్వామి ఆర్యవేశ్, ఆచార్య సూర్యాదేవి, పండిత ధర్మపాల్ శాస్త్రి, ఆచార్య యోగేంద్ర యాజక్, ఆచార్య విశ్వశ్రవ, నల్లగొండ జిల్లా ఆర్య సమాజ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రణవానంద స్వామి

యాదాద్రి ఆలయాభివృద్ధికి కృషిచేస్తా

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



తూర్పు మాఢ వీధిలో ఏర్పాటు చేసిన స్టాండ్‌లో భక్తులతో కొబ్బరికాయ కొట్టిస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. యాదాద్రి కొండపైన గల తూర్పు మాఢ వీధిలో భక్తులు కొబ్బరి కాయలు కొట్టేందుకుగాను స్టాండ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వాతి నక్షత్రం సందర్భంగా తూర్పు మాఢ వీధిలోని క్యూలైన్ సమీపంలో భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు వీలుగా స్టాండ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కొండపైన భక్తులు నిద్ర చేసేందుకు డార్మెంటరీ హాల్ నిర్మాణంతో పాటు తాత్కాలిక హాల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయాభివృద్ధికి నిధులు ఎక్కువగా తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డితో యాదాద్రి ఆలయానికి సంబంధించి పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. త్వరలోనే దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి సందర్శించి, రివ్యూ నిర్వహించిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి ఆలయాన్ని సందర్శిస్తారని వెల్లడించారు. పాత సంప్రదాయం ప్రకారం త్వరలో యాదాద్రిని యాదగిరిగుట్టగా, భద్రాద్రిని భద్రాచలంగా మారుస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అంతకు ముందు శ్రీస్వామిని దర్శించుకున్న విప్ బీర్ల ఐలయ్యకు ఆలయ అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, ఎంపీపీ చీర శ్రీశైలం, వర్తక సంఘం అధ్యక్షుడు గడ్డమీది మాధవులు, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి తిరుమల దేవస్థానంగా స్వర్ణగిరి క్షేత్రం





భువనగిరి పట్టణ శివారులోని పగిడిపల్లిలో నిర్మించిన స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం

- భువనగిరి సమీపంలో 22 ఎకరాల్లో రూపుదిద్దుకున్న స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం
- ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాలు
- 6న వేంకటేశ్వరస్వామి ప్రాణప్రతిష్ట

భువనగిరి : భువనగిరి మండలంలోని పగిడిపల్లి గ్రామ పరిధిలో 22 ఎకరాల స్థలంలో నిర్మించిన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం ఆలయం ప్రాణప్రతిష్ఠ మహా కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 6వ తేదీ వరకు జరగనున్నాయి. 6న ఉదయం 11.06 గంటలకు జరిగే ప్రాణప్రతిష్ఠకు త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి హాజరుకానున్నారు. మానెపల్లి రామారావు, విజయలక్ష్మీ దంపతులు కుమారులు మానెపల్లి మురళీకృష్ణ, గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఆలయాన్ని నిర్మించారు. కృష్ణ శిలలతో ఆలయాన్ని సుందరంగా నిర్మించి యాదాద్రి తిరుమల దేవస్థానంగా పేరు రూపుదిద్దుకునేలా తీర్చిదిద్దారు. 12 అడుగుల ఎత్తులో శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని రూపొందించారు. ప్రసిద్ధి చెందిన స్థపతి డీఎస్‌వీ ప్రసాద్ పర్యవేక్షణలో ఆలయం నిర్మించబడింది. ఆలయానికి సంబంధించిన ప్రధాన తూర్పు గోపురానికి త్రైలోక్య మల్ల రాజగోపురం, దక్షిణ రాజగోపురానికి త్రిభువన మల్ల రాజగోపురం, పశ్చిమ గోపురానికి భువనైక మల్ల రాజగోపురం, ఉత్తర గోపురానికి కాకతీయ రాజుల బిరుదులతో రాయ గజకేసరి రాజగోపురంగా నామకరణం చేశారు. ఆలయం ఆవరణంలో గరుడాళ్వార్, మదన గోపాలకృష్ణ స్వామి, పద్మవతి అమ్మవారు దేవాలయాలను నిర్మించారు. ఈ నెల 7వ తేది నుంచి భక్తులకు పూజా కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు అనుమతిస్తున్నట్లు మానేపల్లి ట్రస్ట్ అధినేత రామారావు, స్థపతి డీఎస్‌వీ ప్రసాద్, పూజారి శ్రవణాచార్యులు తెలిపారు.

కారు ఢీకొని నలుగురికి గాయాలు

రామన్నపేట: మండలంలోని సిరిపురం గ్రామ శివారులో శుక్రవారం బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామానికి చెందిన బోదాసు రాజు తన కుటుంబసభ్యులతో కలిసి బైక్‌పై రామన్నపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో మార్కండేయస్వామి ఆలయం సమీపంలో ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజుతోపాటు అతడి భార్య వాణి, కుమారులు శశాంక్, హర్షవర్ధన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ మల్లయ్య వారితో మాట్లాడి వివరాలు సేకరించారు.

ఆడిటింగ్ శాఖ కార్యాలయంలో అగ్నిప్రమాదం

- ఫైళ్లు, కంప్యూటర్లు, ఇతర సామగ్రి దగ్ధం



ఆడిట్ కార్యాలయంలో దగ్ధమైన కుర్చీలు, టేబుళ్లు



దగ్ధమైన కంప్యూటర్

నల్లగొండ : నల్లగొండ జిల్లా కేంద్రంలోని పాత జిల్లా పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న జిల్లా ఆడిట్ శాఖ కార్యాలయంలో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. సుమారు రాత్రి 12 గంటల సమయంలో ఆడిట్ కార్యాలయంలోని కంప్యూటర్ గది, జిల్లా అధికారి గది నుంచి మంటలు రావడాన్ని.. ఇదే ఆవరణలో ఉన్న ఆర్‌అండ్‌బి శాఖ సిబ్బంది ఒకరు గమనించి ఆడిట్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే వారు అగ్నిమాపక అధికారులకు చెప్పారు. రాత్రి 12. 30 గంటల ప్రాంతంలో ఆడిట్ సిబ్బందితోపాటు, జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. అయితే, అప్పటికే చాలా ఫైళ్లు దగ్ధమయ్యాయి. ఆడిట్ కార్యాలయంలోని కంప్యూటర్ గది మొత్తం దగ్ధమైంది. కంప్యూటర్లకు యూపీఎస్ అమర్చిన చోట షార్ట్‌సర్క్యూట్ కావడం వల్ల మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు. సీలింగ్ అటుకోవడం వల్ల మంటలు ఎగిసిపడి కంప్యూటర్లతోపాటు, బీరువాలు కాలిపోయాయి. బీరువాలలో ఉన్న ఫైళ్లతో పాటు టేబుళ్లపై ఉన్న ఫైళ్లు కూడా దగ్ధమయ్యాయి. ప్రధానంగా నాలుగు కంప్యూటర్లతోపాటు నాలుగు బీరువాలు, అందులో ఉన్న 8 వరకు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నవారి ఎస్.ఆర్ బుక్కులు కాలిపోయాయి.

సంఘటనపై అనుమానాలు...

ఆడిట్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు షార్ట్‌సర్క్యూట్ కావడం వల్ల మంటలు చెలరేగాయని చెబుతుండగా.. చేసిన తప్పిదాలు, అక్రమాలు బయటపడతాయని అందుకు సంబంధించిన వారే ప్రమాదాన్ని సృష్టించారనే చర్చ సాగుతోంది. గతంలో కూడా మున్సిపాలిటీలో కొందరు ఉద్యోగులు అక్రమాలకు పాల్పడి ఫైళ్లను దగ్ధం చేశారని, అదే తరహాలో ఆడిట్ కార్యాయంలో కూడా ఫైళ్ళ దగ్ధానికి పాల్పడ్డారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

షార్ట్‌సర్క్యూట్ వల్లే ప్రమాదం
– కృపాకర్‌రావు, ఆడిట్ అధికారి

ఆడిట్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ వల్లనే అగ్నిప్రమాదం జరిగిందని, కొన్ని ఫైళ్లు పాక్షికంగా, కొన్ని ఫైళ్లు పూర్తిగా కాలిపోయాయని జిల్లా ఆడిట్ అధికారి కృపాకర్‌రావు చెప్పారు. అయితే, ముఖ్యమైన డేటా అంతా దగ్ధమైన కంప్యూటర్లలోనే నిక్షిప్తమై ఉందని, వారం రోజుల్లో తిరిగి అన్ని ఫైళ్లను తయారు చేస్తామని చెప్పారు. ఎస్.ఆర్‌లు కూడా పూర్తిగా కాలలేదని చెప్పారు. ఎవరికి కూడా ఎలాంటి నష్టం జరుగకుండా చూస్తామని చెప్పారు. కాగా, ఈ సంఘటనను హైదరాబాద్ ఆడిట్ అధికారి కూడా వచ్చి పరిశీలించారు.



కాలిపోయిన ఫైళ్లు

పీడీఎస్ బియ్యం పట్టివేత

మఠంపల్లి: మండలంలోని రఘునాథపాలెంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన మహ్మద్ అమీర్ తన ఇంటిలో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వచేశాడని వచ్చిన సమాచారంతో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మూడు గేదెలు మృతి

భువనగిరి రూరల్: భువనగిరి మండలంలోని ఎర్రంబెల్లి గ్రామంలో సోమలేటి సైదులుకు చెందిన మూడు గేదెలు శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాయి. పట్టణంలోని ఓ సీడ్స్ దుకాణంలో పశువుల దాణా తీసుకువచ్చి నీటిలో కలిపి గేదెలకు పెట్టిన అనంతరం అవి కిందపడి కొట్టుకుని మృతిచెందాయని రైతు పేర్కొన్నాడు. సైదులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

- ఎండమావులు



ఈ చిత్రాలను చూస్తే రోడ్డుపై నీరు పారుతున్నట్లే ఉంది కదా.. ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో యాదాద్రి భువనగిరిలోని వరంగల్–హైదరాబాద్ రోడ్డుపై ఇలా ఎండమావులు ఏర్పడ్డాయి. ఈ వేసవిలో ఎండలు ఎక్కువ ఉంటాయనడానికి ఈ చిత్రాలే నిదర్శనం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి



చికిత్స పొందుతున్న మహిళ మృతి

- ఆటోను బస్సు ఢీకొట్టిన ఘటనలో ఆరుకు చేరిన మృతుల సంఖ్య



లక్ష్మి (ఫైల్)

మునగాల(కోదాడ): మోతె శివారులో ఇటీవల ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు ఘటనలో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. తీవ్రంగా గాయపడిన మునగాల మండలంలోని రేపాల గ్రామానికి చెందిన సొంపంగు లక్ష్మి(35) హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. వివరాల ప్రకారం.. రేపాలకు చెందిన సొంపంగు అంజయ్య కుమార్తె లక్ష్మికి వివాహమైనప్పటికీ కొన్నేళ్లుగా భర్తకు దూరంగా ఉంటుంది. రేపాలలోనే కూలీనాలీ చేస్తూ జీవనం సాగిస్తూ తండ్రిని పోషిస్తోంది. ఈ క్రమంలో గత బుధవారం తన తోటి కూలీలతో విజయరాఘవపురం గ్రామానికి చెందిన ఆటోలో మిర్చి తోటలో కాయలు ఏరేందుకు మోతె మండలం హుస్సేనాబాద్‌కు బయలుదేరింది. మార్గమధ్యంలో కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను మోతె మండల కేంద్రం శివారులో అండర్‌పాస్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయరాఘవపురం గ్రామానికి చెందిన ముగ్గురు కందుల నాగమ్మ, చెవుల నారాయణమ్మ, పోకల అనసూర్యమ్మ అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. తీవ్ర గాయాలైన విజయరాఘవపురం వాసులు కందుల గుర్వయ్య, రెమిడాల సౌభాగ్యమ్మ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందారు. ఇదిలా ఉండగా.. తీవ్ర గాయాలపాలైన రేపాలకు చెందిన సొంపంగు లక్ష్మి మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడి శుక్రవారం తుదిశ్వాస విడిచింది. రేపాలకు చెందిన పోకల అనసూర్యమ్మ(70) అంత్యక్రియలు జరిగి 24గంటలు గడవకముందే లక్ష్మి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

శుభకార్యం జరగాల్సిన ఇంట్లో విషాదం

- ఈ నెల 6న కుమార్తె వివాహం
- శుభలేఖలు పంచడానికి వెళ్లొస్తూ మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన తండ్రి
- చికిత్స పొందుతూ మృతి



రాములు(ఫైల్)

నిడమనూరు: శుభకార్యం జరగాల్సిన ఇంట్లో విషాదం నెలకొంది. తన కూతురు వివాహ లగ్నపత్రికలు పంచేందుకు వెళ్లి వస్తుండగా.. మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నిడమనూరు మండలం ఊట్కూర్ గ్రామానికి చెందిన నర్సింగ్ రాములు(55), పుల్లమ్మ దంపతులకు మహేశ్వరి, మమత ఇద్దరు కుమార్తెలు.. పెద్ద కుమార్తె వివాహం అయింది. చిన్న కుమార్తె మమతకు ఈనెల 6వ తేదీన వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన బంధువైన శేఖర్‌తో కలిసి ఫిబ్రవరి 28న శుభలేఖలు పంచేందుకు బైక్‌పై వెళ్లాడు. శ్రీనాథపురం స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శేఖర్ అక్కడికక్కడే మృతిచెందగా.. రాములుకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తుంగతుర్తి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన శుక్రవారం గానుగుబండలో చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గానుగుబండ గ్రామానికి చెందిన గూడెల్లి వీరమల్లు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలంటుకొని ఇంట్లో ఉన్న సామగ్రి కాలిపోయింది. ఇంట్లో నుంచి పొగలు వస్తుండగా గ్రామస్తులు గమనించి వీరమల్లుకు సమాచారం అందించారు. ఆయన వచ్చి చూసేసరికి ఇంట్లో ఉన్న టీవీ, బీరువా, మంచం, దుస్తులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

ఒక్కొక్కరికి మూడు.. నాలుగు కొలువులు

- పట్టుబట్టి చదివి ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు



విజయలక్ష్మి

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని అడ్లూరుకు చెందిన ఎర్రగొల్ల విజయలక్ష్మి ఇటీవల విడుదల చేసిన గురుకుల టీజీటీ, పీజీటీ ఉద్యోగాలకు ఎంపికకాగా.. గురువారం విడుదల చేసిన జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి కూడా ఎంపికైంది. తన భర్త పాశం రామాంజి, కుటుంబ సభ్యుల సహకారంతోనే పరీక్షలకు సన్నద్ధమై ఈ ఉద్యోగాలు సాధించినట్లు విజయలక్ష్మి తెలిపారు.

గిరిజన మహిళకు..



సుజాత

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పోర్లగడ్డతండాకు చెందిన అంగోతు సుజాత ఇటీవల పీజీటీ, టీజీటీ ఉద్యోగం సాధించింది. అదేవిధంగా గురుకుల జూనియర్ లెక్చరర్ ఉద్యోగం కూడా వచ్చింది. ప్రస్తుతం కేంద్రియ విద్యాలయం -చంద్రయాన్‌గుట్టలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. తన తండ్రి హతీరాం, భర్త సంతోష్‌కుమార్ సహకారంతో ఉద్యోగాలు సాధించినట్లు ఆమె పేర్కొంది.


పుస్తకాలతో కుస్తీ



మందుల మంగమ్మ

నడిగూడెం: పుస్తకాలతో కుస్తీ పట్టి, నాలుగు ఉద్యోగాలు సాధించింది నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన మందుల మంగమ్మ. ఎలాంటి కోచింగ్ లేకుండానే పట్టుదలతో పరీక్షలకు సన్నద్ధమైంది. కేజీబీవీ పరీక్షలో పీజీటీ ఉద్యోగంతోపాటు, గురుకుల పీజీటీ, టీజీటీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు సాధించింది


పార్ట్‌టైం జాబ్ చేస్తూ..



నల్లగంతుల మల్లేష్

డిండి: డిండి పట్టణానికి చెందిన నల్లగంతుల మల్లేష్ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. మల్లేష్ చిన్నతనంలోనే అనారోగ్యం కారణంతో తల్లిదండ్రులిద్దరూ చనిపోయారు. నిరుపేద కావడంతో హైదరాబాద్‌లో పార్ట్‌టైం జాబ్ చేస్తూ ఉన్నత చదువులు చదివాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో జూనియర్ లెక్చరర్, పీఈటీ, పీజీటీ ఉద్యోగాలు పొందాడు.


కుటుంబసభ్యుల హర్షం



సిలువేరు సుష్మ

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన సిలువేరు సుష్మ ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. తాజాగా వెలువడిన గురుకుల ఫలితాల్లో జూనియర్ లెక్చరర్‌తోపాటు, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించారు. సుష్మ విజయానికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఒకేసారి నాలుగు ఉద్యోగాలు



హరిత

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన ఎల్లాపంతుల ఉమామహేశ్వర్ భార్య హరిత ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. గురుకుల కెమిస్ట్రీ లెక్చరర్, గురుకుల పీజీటీ ఫిజికల్ సైన్స్, టీజీటీ జనరల్ సైన్స్, టీజీటీ బయోలజికల్ సైన్స్ విభాగాల్లో ఉద్యోగాలు పొందింది. ఆమె ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే..



షేక్ ఆసిఫ్

మాడుగులపల్లి : మాడుగులపల్లి మండలం చిరుమర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ ఆసిఫ్ ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే.. పోటీ పరీక్షలకు సన్నద్ధమై గురుకుల జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించాడు. తన కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, భార్య తోడ్పాటు ఈ విజయానికి కారణమని షేక్ ఆసిఫ్ పేర్కొన్నాడు.

మొదటి ప్రయత్నంలోనే..



రామరాజు

నల్లగొండ: నల్లగొండ పట్టణం అక్కలాయిగూడేనికి చెందిన కన్నెబోయిన రామరాజు మొదటి ప్రయత్నంలోనే గురుకుల పీజీటీ, జేఎల్, డీఎల్ ఉద్యోగాలు సాధించాడు. ఈమేరకు శుక్రవారం జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం, యాదవ యువజన సంఘం ఆధ్వర్యంలో రామరాజును సన్మానించి అభినందనలు తెలిపారు.